క్లుప్తంగా

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్సై స్వామి

పెద్దపల్లిరూరల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని బసంత్‌నగర్ ఎస్సై స్వామి అన్నారు. పెద్దపల్లి మండలం అందుగులపల్లి, దేవునిపల్లి, రంగాపూర్ గ్రామాల్లో శనివారం పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఊళ్లలో అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలన్నారు. నాయకులు కారె శ్రీనివాస్, రాయిశెట్టి కిషన్, గంట రమేశ్ పాల్గొన్నారు.

చిన్నారుల కూచిపూడి నాట్య ప్రదర్శన



కూచిపూడి నాట్యం చేస్తున్న చిన్నారులు

గోదావరిఖనిటౌన్: ఉజ్వల నృత్యఖని ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకురాలు గుమ్మడి ఉజ్వల ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి శ్రీకోదండ రామాలయంలోని శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, మార్కండేయకాలనీలోని మార్కండేయ శివాలయాల్లో చిన్నారులతో కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. నాట్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వాహకురాలు చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

బిల్లులు రావడం లేదు



నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్ రమేశ్

ముత్తారం: తమకు బిల్లులు రావడం లేదని మండలంలోని ఖమ్మంపల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేశ్ శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఉపాధిహామీ పథకం, గ్రామ పంచాయతీ అభివృద్ధి నిధుల మంజూరుతో చేసిన పనులకు బిల్లులు రావడం లేదని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎంపీవో వ్యక్తిగత కక్షతో తమకు బిల్లులు రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. మిగతా గ్రామ పంచాయతీలకు బిల్లులు ఇస్తూ తమకు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిరసన కార్యక్రమం చేపడతానని మాజీ సర్పంచ్ పేర్కొన్నారు.


పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలివ్వండి



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు కోరారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలకు రూ.9500 వేతనంతో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. వీలైనంత త్వరగా చెల్లించాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని తెలిపారు. నాయకులు ఎండీ ఖాజా, నరేశ్, శ్రీనివాస్, ముస్తఫా, సందీప్, రాజయ్య, కొండయ్య పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



పూజల్లో పాల్గొన్న ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు

రామగిరి: ఆర్జీ-3, ఏపీఏ ఏరియా పరిధిలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయం ఆవరణలో గల త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం జి.రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఈ.లక్ష్మీనారాయణ, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, డీవైపీఎం గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

హామీలన్నీ 'గ్యారంటీ'గా అమలు చేస్తాం

ఓదెల: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ గ్యారంటీగా అమలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం మండలంలోని గోపరపల్లె, హరిపురం, కొలనూర్, పొత్కపల్లి, రూపునారాయణపేట, కనగర్తి, ఓదెల గ్రామాల్లో సీసీరోడ్లను ప్రారంభించారు. యాదవరెడ్డి సంఘం కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ 11న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం అవుతుందన్నారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, ఎంపీటీసీ గోపు లావణ్య, మాజీ వైస్ఎంపీపీ పిట్టల రవికుమార్, స్పెషల్ అధికారి డాక్టర్ మౌనిక, ఏఈఈ సమ్మిరెడ్డి, నాయకులు చింతిరెడ్డి విజేందర్‌రెడ్డి, గట్టుయాదవ్, అమ్ముల బిక్షపతి, ఎడవెల్లి జైపాల్‌రెడ్డి, చీకట్ల మొండయ్య, ఎంపీడీవో తిరుపతి, తహసీల్దార్ యాకన్న పాల్గొన్నారు.



ఓదెల: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

మంచినీటి పథకాలకు రూ.1.38కోట్లు

ఓదెల: పెద్దపల్లి నియోజకవర్గంలో 105 గ్రామపంచాయతీల్లో మంచినీటి ఎద్దడి నివారణకు రూ.1.38కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. మండలంలోని పొత్కపల్లి సొసైటీలో శనివారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. మంచినీటి బావులు, పైపులైన్ల నిర్మాణం కోసం నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, సీఈవో డైరెక్టర్లు ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి సదయ్య, సీఈవో గోలి అంజిరెడ్డి, ఓదెల ఎంపీడీవో తిరుపతి పాల్గొన్నారు.

పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

కాల్వశ్రీరాంపూర్: పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం, మంగపేట, జాఫర్‌ఖాన్‌పేట, వెన్నంపల్లి గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ నూనెటి సంపత్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఎంపీటీసీలు కొల్లూరి రమ, జట్టి దేవయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, మాజీ సర్పంచులు విజయ, మొగిలి, మల్లయ్య, సతీశ్, వెల్తూరి రమేశ్, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు సజ్జు, కలీమొద్దీన్ పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు నరికివేత

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గేట్ నుంచి యైటింక్లయిన్‌కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై రాష్ట్ర ప్రభుత్వం 2018 హరితహారంలో నాటిన సుమారు 150 మొక్కలను శనివారం విద్యుత్ అధికారులు నరికివేశారు. కార్పొరేషన్ అధికారులు హరితహారం మొక్కలు నాటే క్రమంలో నిర్లక్ష్యం చేయడంతోనే ఇలాంటి పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. మొక్కలు పెరిగి నీడనిచ్చే సమయంలో చెట్లను నరకడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మొక్కలు నరికిన విద్యుత్‌శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.



నరికివేతకు గురైన మొక్కలు

నేషనల్ అథ్లెటిక్స్‌లో బుగ్గాజికి సిల్వర్ మెడల్

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ఆర్జీ-3, ఓసీసీ-1లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగి కాంటివాడ బుగ్గాజి జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకాన్ని సాధించారు. కర్ణాటకలోని మహాత్మగాంధీ స్టేడియంలో ఉడిపి మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఆర్) ఆధ్వర్యంలో 9, 10వ తేదీల్లో నిర్వహిస్తున్న రెండో సౌత్ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్ జాతీయ స్థాయి 55 ఏళ్ల విభాగంలో 500 మీటర్ల పరుగు పందెం పోటీల్లో పాల్గొని రెండోస్థానంలో నిలిచారు. బుగ్గాజికి ఉడిపి మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేందర్ షెట్టి, ఉదయ్ కుమార్ ప్రశంసపత్రంతో పాటు సిల్వర్ మెడల్ అందజేశారు.



మెడల్ ప్రదానం చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు ఆటలపోటీలు



ప్రారంభిస్తున్న పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి



మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న మహిళలు

రామగిరి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-3, ఏపీఏ ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు శనివారం జీఎం కార్యాలయంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి హాజరై ఆటల పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు 11న సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్న మహిళా దినోత్సవంలో బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీవైపీఎంలు గుర్రం శ్రీహరి, వి.సునీల్ ప్రసాద్, డిప్యూటీ మేనేజర్(ఐటి) ఆర్.రాజేశ్వరి, ఎస్టేట్ అధికారి ఎస్.శ్యామల, సేవా కోఆర్డినేటర్ బి.రాయమల్లు, ఉద్యోగులు బెల్లం జ్యోతి, సౌమ్య, రమ్య పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

గోదావరిఖని: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-2 ఏరియాలో శనివారం మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను జీఎం ఎల్వీ సూర్యనారాయణ ప్రారంభించారు. విజేతలకు 14న బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులతో ఫౌండేషన్ ప్రతినిధులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆటల్లో గెలుపు, ఓటమి సహజమని కెవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ చైర్మన్ వినోద్‌కుమార్ అన్నారు. మహా శివరాత్రి జాగరణలో భాగంగా శుక్రవారం రాత్రి యైటింక్లయిన్‌కాలనీలోని అబ్దుల్‌కలాం స్టేడియంలో ఫుట్‌బాల్ క్లబ్, కెవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి అందించి మాట్లాడారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. 15, 16 డివిజన్ కార్పొరేటర్లు శంకర్‌నాయక్, కిషన్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థి మంజునాథ్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు బంగారు పతకం సాధించాడు. శనివారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏవో సురేశ్, పద్మిని, రాజిరెడ్డి ఉన్నారు.



అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

'ఖని'లో రోడ్ల విస్తరణకు సింగరేణి శ్రీకారం

గోదావరిఖని: రోడ్లను విస్తరించేందుకు సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఈమేరకు సంస్థకు చెందిన 72క్వార్టర్లను కూల్చేందుకు సిద్ధమైంది. ఆ క్వార్టర్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయాలని యాజమాన్యం శనివారం నోటీసులు జారీ చేసింది. భాస్కర్‌రావు భవన్ టూ చౌరస్తా, చౌరస్తా టూ లీగల్ షూమార్టుతో పాటు పోచమ్మగుడి వెనకాల నుంచి గర్ల్స్ కాలేజీ వరకు ఉన్న 72 క్వార్టర్లను తొలగించడానికి ముందుకు వచ్చింది. ఈ ఏరియాల్లో కనీసం 40మీటర్ల రోడ్లను విస్తరించాలని నిర్ణయించింది. క్వార్టర్ల కూల్చివేతతో పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ క్వార్టర్లు ఆనుకుని ఏర్పాటు చేసుకున్న షాపులు పూర్తిగా తొలగించే అవకాశం ఉండటంతో వారిలో ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే ప్రజా అవసరాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని, అందరూ సహకరించాలని యాజమాన్యం పేర్కొంటోంది. దీంతో భాస్కర్‌రావుభవన్ నుంచి లీగల్ షూమార్టు వైపు ఎడమవైపు ఉన్న క్వార్టర్లతో పాటు క్వార్టర్లను ఆనుకుని ఉన్న షాపులన్నీ తొలగించే అవకాశాలున్నాయి. శనివారం నోటీసులు రావడంతో షాపుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. వీరికి మరో చోట షాపులు కేటాయించడమా? లేక ప్రత్యామ్నాయ చర్యలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారంగా ఆదేశాలు జారీకావడంతో క్వార్టర్ల తొలగింపు తప్పనిసరిగా మారింది.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ రకాల పండ్లతో ప్రత్యేక అభిషేకం, కలుష పూజ నిర్వహించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్, రఘునాథ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బసంత్‌నగర్ ఎంపీటీసీ పాత భాగ్యలక్ష్మి దంపతులు, గురుస్వాములు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామోజు తిరుమలాచారి, గుండా రమేశ్, తోడేటి రవికుమార్, రాజేశ్, రాజు, సురేశ్, మల్లేశ్, కుమార్, పృథ్వీరాజ్, పాత నాగభూషణం, సత్యనారాయణ, లింగమూర్తి పాల్గొన్నారు. అదేవిధంగా శివాలయంలో అన్నపూజ నిర్వహించారు. శివలింగానికి అభిషేకం నిర్వహించి అన్నప్రసాదంతో లింగాన్ని అలంకరించారు. ఆలయ పూజారి శ్రీసేనాపతి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాత దేవేందర్, రామస్వామి పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి అభిషేకం

విజేతలకు బహుమతి ప్రదానం



ట్రోఫీతో విజేతలు

కమాన్‌పూర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో హెల్పింగ్ హ్యాండ్స్ వారు శుక్రవారం రాత్రి క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతగా కమాన్‌పూర్ మహదేవ్ జట్టు నిలవగా, రన్నర్‌గా భూపాలపల్లి జిల్లా కాటారం నుంచి వచ్చిన టీమ్ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ ట్రయల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ తెలిపారు. 8వ తేదీన గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు నందీశ్‌గౌడ్, మహాశివసాయి, సన్నీ, సంక్షిప్త, శిరీష్మ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్ఎం. అఫ్జల్, కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో శనివారం క్రిసెంట్ హైస్కూల్ విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల సాంకేతిక, సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని, అందుకే ఇలాంటి ప్రదర్శనలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ సయ్యద్ నజీర్ తెలిపారు. చంద్రయాన్-3, బ్లడ్ గ్రూప్ టెస్ట్ చేసి ఫలితాలు వెంటనే చెప్పడం, ఫైర్ అలారం, డయాలిసిస్, వాక్యూమ్ క్లీనర్, మంకీగన్, సోలార్ పవర్, ఆటోమెటిక్ పవర్ జనరేటర్, గ్రాస్‌కట్టర్, ఫారెస్ట్, వైల్డ్ ఎనిమల్, ఎయిర్ పొల్యూషన్, సౌండ్ పొల్యూషన్, ఆటోమెటిక్ స్ట్రీట్‌లైట్‌తో పవర్ సేవ్, ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై విద్యార్థుల ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఆహుతలను అబ్బురపరిచాయి. మాజీ సర్పంచులు సంగీత మహేందర్, సుజాత రమేశ్, విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఆయాజ్ పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

మహిళలకు పరుగు పందెం పోటీలు



బహుమతి అందజేస్తున్న కస్నూరి అనిల్

రామగిరి: సెంటనరీకాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగాణంలో శనివారం నెహ్రూ యువ కేంద్రం జాతీయ యువజన వలంటీర్ కస్నూరి అనిల్ ఆధ్వర్యంలో మహిళలకు 100మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. పోటీల్లో విజేతగా నిలిచిన మహిళలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన మహిళలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో వివిధ సెక్షన్లనో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ అన్నారు. శనివారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ సివిక్ జోన్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటేశ్, పద్మ, శ్రీను, రాజనర్సు, రాము, శేఖర్, రవి, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బి.అశోక్

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని: మంథని విద్యుత్ ఉప కేంద్రం, గుంజపడుగు, ఫీడర్‌లో మరమ్మతు దష్ట్యా ఆదివారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సీహెచ్.మల్లయ్య తెలిపారు. పుట్టపాక ఫీడర్ పరిధిలోని గుమునూరు, గాజులపల్లి, గొల్లపల్లి, లక్ష్మీపూర్, లక్కేపూర్, తోటగోపయ్యపల్లి, మైదుపల్లి, వెల్గల పహాడ్, గుంజపడుగు గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నియామకం

ఫెర్టిలైజర్‌సిటీ: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా సోమారపు లావణ్యఅరుణ్‌కుమార్‌ను నియమిస్తూ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను నియమించినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శిల్పారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీని శనివారం ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణానికి తరలివచ్చిన భక్తులు సమర్పించిన కానుకలు, విరాళాలు మొత్తం రూ.83,350 వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యుడు పొట్టాల మల్లేశం వెల్లడించారు. సభ్యులు రమేశ్, సత్యం, మహేశ్, అనిల్, రమేశ్, స్వామి, రమేశ్, వెంకటరమణ, వజ్రారెడ్డి, డాక్టర్ సత్యం, ఆలయ పూజారి నవీన్ ఉన్నారు.

మహిళలకు సన్మానం

పాలకుర్తి: మండలంలోని ఘనశ్యాందాస్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళలను శనివారం మాజీ సర్పంచ్ సూర సమ్మయ్య ఆధ్వర్యంలో సన్మానించారు.

ఎన్టీపీసీలో రక్తదాన శిబిరం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శనివారం తెలంగాణ స్టేజీ-1లోని బీహెచ్ఈఎల్ అతిథి గృహంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణ బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా నాగపూర్‌లోని పవర్ సెక్టార్ వెస్టర్న్ రీజియన్ బృందం పర్యవేక్షణలో 53వ జాతీయ భద్రతా దినోత్సవంలో భాగంగా 54మంది రక్తదానం చేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మేడిపల్లి సండే మార్కెట్ సమీపంలోని అతిథి గృహంలో శిబిరం నిర్వహించినట్లు ప్రాజెక్టు డైరెక్టర్ దిలీప్‌కుమార్ సర్కార్, ఐఆర్‌సీఎస్ బృందం సభ్యులు సతీశ్, సత్యపాల్‌రెడ్డి, శరత్‌కుమార్, శ్రీనివాస్, డాక్టర్ ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి

సుల్తానాబాద్: కరీంనగర్ వి.కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించే గౌడ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్ కోరారు. శనివారం పట్టణంలోని గౌడ కాలనీలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు.

పొన్నం ఆత్మీయ సభ విజయవంతం చేయండి

ఓదెల: కరీంనగర్ పట్టణంలోని వీ కన్వెన్షన్‌లో జిల్లా గౌడసంఘాల ఐక్యవేదికల ఆధ్వర్యంలో ఆదివారం జరిగే మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆత్మీయసభను విజయవంతం చేయాలని రాష్ట్ర గీతకార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్ కోరారు. శనివారం మండల కేంద్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో గీత కార్మికులు, నాయకులు ఆత్మీయ సన్మాన సభకు తరలిరావాలన్నారు. గౌడసంఘం నాయకులు అనిల్, బైరి సంతు, సారయ్యగౌడ్, జంపయ్య, చంద్రయ్య, తిరుపతిగౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పీఆర్సీ ప్రకటనపై ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

గోదావరిఖనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 2017కి సంబంధించిన 21శాతం పీఆర్సీ ప్రకటించడంపై గోదావరిఖని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు శనివారం సాయంత్రం సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సంస్థ ఎండీ సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎం.నాగభూషణం, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ గీతాకృష్ణ, మెకానికల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.సంధ్యారాణి, ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు టీకే.స్వామి, వి.ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి నేత్రదానం.. ఆరుగురికి చూపు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన ముగ్గురు వ్యక్తులు తమ మరణం శరీరానికే తప్ప.. నేత్రాలకు కాదని నిరూపించారు. వేర్వేరు ప్రాంతాల్లో మృతి చెందిన ఈ ముగ్గురూ నేత్రదానం చేసి, ఆరుగురు అంధులకు చూపును ప్రసాదించారు. గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన కోరె సదానందం(48) అనే మెడికల్ షాపు వ్యాపారి గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. నేత్రదానంపై కుటుంబ సభ్యులకు లయన్స్ క్లబ్ ప్రతినిధి లక్కం భిక్షపతి అవగాహన కల్పించడంతో , మృతుని తండ్రి ఓదెలు, భార్య రమ్య, కూతురు రోషిని, కుమారుడు రోషన్ ముందుకు వచ్చారు. టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు తరలించారు. అలాగే స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన అనిగాల కనుకమ్మ(60) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. నేత్రదానంపై కోలేటి భాస్కర్ మృతురాలి కుటుంబ సభ్యులను అవగాహన కల్పించగా, భర్త అంకూస్, కొడుకులు పోషాలు, ఓదెలు, రమేశ్, కూతురు పుష్పలత ముందుకు వచ్చారు. టెక్నీషియన్ ఆరిఫ్, సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు రాజమౌళి ద్వారా సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లో ఐ బ్యాంక్‌కు తరలించారు. స్థానిక కల్యాణ్‌నగర్‌కు చెందిన కొత్వాల కిషన్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కాగా కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి పృథ్వీరాజ్, అతహరుద్దీన్, మాజీ ఎంపీటీసీ దేవిస్రవంతి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దేవి లక్ష్మీనర్సయ్య సూచనల మేరకు కుటుంబ సభ్యులు మృతుని నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఎల్వీప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ లక్ష్మణ్ ద్వారా నేత్రాలను హైదరాబాద్‌కు తరలించారు. సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆ కుటుంబాలను అభినందించారు.

వైభవంగా మల్లికార్జునస్వామి పట్నాలు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరావుల మల్లికార్జునస్వామి ఉత్సవాలు శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు ఆలయంలో మల్లికార్జునస్వామి లగ్న పట్నం వేసిన ఒగ్గు పూజారులు స్వామివారి జీవిత కథను ఒగ్గు కథగా వినిపించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించారు. యాదవ సంక్షేమ సంఘం నాయకులు సురేందర్, మల్లెత్తుల కనుకయ్య, రాజులు, కొమురయ్య ఉన్నారు.

